క్లుప్తంగా

ఘనంగా గొబ్బెమ్మల ఉత్సవం



మనుబోలు: మండలంలోని జట్లకొండూరులో గొబ్బెమ్మల గ్రామోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. గ్రామంలో గొబ్బెమ్మను ఉంచి ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు చేశారు. మహిళలు పెద్ద ఎత్తున ధూపదీప నైవేద్యాలతో గొబ్బెమ్మకు ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఉప సర్పంచ్ ఆవుల తులసీరామ్ కుటుంబసమేతంగా పూజలకు హాజరయ్యారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించిన గొబ్బెమ్మను ట్రాక్టర్‌పై ఉంచి గ్రామంలోని వీధుల మీదుగా ఉత్సవాన్ని నిర్వహించారు.

హ్యాండ్‌వాష్ మెషీన్ ప్రారంభం



బుచ్చిరెడ్డిపాళెం రూరల్: నగర పంచాయతీ పరిధిలోని బెజవాడ గోపాల్‌రెడ్డి పార్కులో హ్యాండ్‌వాష్ మెషీన్‌ను చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ప్రజలు ఆరోగ్యంగా ఉండాలనే ఉద్దేశంతో హ్యాండ్‌వాష్ మెషీన్‌ను మెప్మా సహకారంతో ఏర్పాటు చేశామని వివరించారు. ప్రతి ఒక్కరూ చేతులను తరచూ శుభ్రం చేసుకోవాలని కోరారు. కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి, మెప్మా పీడీ రవీంద్ర, సచివాలయాల కన్వీనర్ మోర్ల మురళి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ చెర్లో సతీష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీల అభివృద్ధికి చర్యలు



మాట్లాడుతున్న వజ్రమ్మ

మనుబోలు: ముందస్తు ప్రణాళికలను రూపొందించుకొని పంచాయతీల అభివృద్ధికి చర్యలు చేపట్టాలని ఎంపీపీ గుండాల వజ్రమ్మ పేర్కొన్నారు. గ్రామ పంచాయతీల అభివృద్ధి ప్రణాళికలపై స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. పంచాయతీలు తమ ఆదాయ వనరులను సమీక్షించుకొని అందుకు అనుగుణంగా అభివృద్ధి ప్రణాళికలను రూపొందించుకోవాలని సూచించారు. మౌలిక వసతుల కల్పన, గ్రామస్తుల కనీస అవసరాలకు పెద్దపీట వేయాలని కోరారు. టీఓటీలు సుదర్శనమ్మ, అనిత, దీపిక, మండల ఉపాధ్యక్షుడు వెంకటరమణారెడ్డి, మనుబోలు ఉప సర్పంచ్ చంద్రశేఖర్‌రెడ్డి, ఎంపీడీఓ ప్రసాద్, ఈఓపీఆర్డీ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

ఆటోను ఢీకొన్న బైక్

• ఇద్దరికి గాయాలు

వెంకటాచలం: ఆటోను ఢీకొనడంతో బైక్‌పై ప్రయాణిస్తున్న ఇద్దరు గాయపడిన ఘటన గొలగమూడి సమీపంలో గురువారం చోటుచేసుకుంది. వివరాలు.. గొలగమూడి నుంచి నెల్లూరు వెళ్తున్న ఆటోను వెనుక నుంచి వస్తున్న బైక్ ఢీకొంది. ఘటనలో రాకేష్, నవదీప్ గాయపడ్డారు. వెంటనే చికిత్స నిమిత్తం నెల్లూరుకు స్థానికులు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వైఎస్సార్ బీమా నగదు అందజేత

కోవూరు: కోవూరు గ్రామ సచివాలయం – 2 పరిధిలో నివసిస్తున్న మానికల నర్సమ్మ మృతి చెందడంతో ఆమె కుమార్తె వెంకటరమణమ్మకు వైఎస్సార్ బీమా పథకంలో భాగంగా రూ.10 వేలను మండల సచివాలయ కన్వీనర్ ప్రసాద్ గురువారం అందజేశారు. పంచాయతీ కార్యదర్శి శారద, సంక్షేమ విద్యా సహాయకురాలు సాయి సుజాత, వలంటీర్ నాగసాయి పాల్గొన్నారు.

దోమపోటుతో పంటలకు నష్టం

ఇందుకూరుపేట: దోమపోటుతో పంటలకు నష్టం జరిగి దిగుబడి తగ్గిపోతోందని, నివారణకు తగు చర్యలు చేపట్టాలని డీడీఏ శివనారాయణ పేర్కొన్నారు. ఇందుకూరుపేటలో డీఆర్సీ ఏడీఏ మారుతిదేవి, వ్యవసాయ పరిశోధన కేంద్ర, నెల్లూరు శాస్త్రవేత్త పరమశివం పర్యటించి దోమ సోకిన పంటలను పరిశీలించారు. సుడి దోమ లక్షణాలు, నివారణ చర్యలను రైతులకు వివరించారు. స్థానిక ఏడీ రాజ్‌కుమార్, ఏఓ రఘునాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలకు త్వరితగతిన పరిష్కారం

• మేయర్ స్రవంతి



రోడ్డు పక్కన పేరుకుపోయిన చెత్తను పరిశీలిస్తున్న స్రవంతి

నెల్లూరు(బారకాసు): నగరపాలక సంస్థ పరిధిలోని 29వ డివిజన్లో గల ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని మేయర్ స్రవంతి పేర్కొన్నారు. గాంధీనగర్‌లో పారిశుధ్య సమస్యలను స్థానిక నేతలతో కలిసి గురువారం పరిశీలించిన అనంతరం ఆమె మాట్లాడారు. పారిశుధ్య పనులను ప్రణాళికబద్ధంగా నిర్వహించి ప్రజలకు ఎలాంటి ఇబ్బందుల్లేకుండా చూస్తామని చెప్పారు. మురుగు కాలువల్లో ఆయిల్‌బాల్స్, ఫాగింగ్, పిచికారీ తదితర చర్యలను చేపట్టాలని ఆదేశించారు. డివిజన్ పరిధిలో తాగునీరు సమయానికి సరఫరా అయ్యేలా చర్యలు చేపడతామని తెలిపారు.

నిబంధనల మేరకే ఓటర్ల నమోదు



మాట్లాడుతున్న దేవీకుమారి

నెల్లూరు(బారకాసు): నిబంధనల మేరకే ఓటర్ల నమోదు కార్యక్రమాన్ని చేపట్టామని ఏఈఆర్వో దేవీకుమారి పేర్కొన్నారు. 2024కు సంబంధించిన ఓటర్ల లిస్ట్ డ్రాఫ్ట్ రోల్, రేషనలైజేషన్ తదితర అంశాలపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాన్ని కార్పొరేషన్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఓటర్ల తుది జాబితాను త్వరలో విడుదల చేయనున్నామని వివరించారు. ఓటర్ల జాబితాకు సంబంధించిన పలు అంశాల్లో ఉన్న తప్పులను పలు పార్టీల ప్రతినిధులు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి రాజీవ్‌రెడ్డి, శ్రీధర్, శంకర్‌రెడ్డి, టీడీపీ నుంచి నారాయణ, అబ్దుల్ అజీజ్, కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, భువనేశ్వరిప్రసాద్, ఏఈఆర్వో నిర్మలానందబాబా, చక్రపాణి తదితరులు పాల్గొన్నారు.

రేషన్ కార్డుల పంపిణీ



నెల్లూరు(బారకాసు): రూరల్ నియోజకవర్గంలోని 21వ డివిజన్ సచివాలయాల పరిధిలో లబ్ధిదారులకు నూతనంగా మంజూరైన రేషన్ కార్డులను కార్పొరేటర్ మొయిళ్ల గౌరి గురువారం అందజేశారు. జేసీఎస్ మండల ఇన్‌చార్జి మొయిళ్ల సురేష్‌రెడ్డి, సచివాలయ కన్వీనర్లు వెంకటరత్నం, సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'శుభమస్తు'లో లక్కీ డ్రా



విజేతకు స్కూటర్ తాళాన్ని అందజేస్తున్న మంత్రి కాకాణి

నెల్లూరు(బృందావనం): నగరంలోని శుభమస్తు షాపింగ్ మాల్లో 37వ స్కూటర్ డ్రా, రెండో కారు డ్రా కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి డ్రా తీశారు. స్కూటర్ డ్రా విజేతగా రాజ్యలక్ష్మి, కూపన్ నంబర్ 06328.. కారు డ్రా విజేతగా రవళి కూపన్ నంబర్ 242436ను ప్రకటించారు. అనంతరం మంత్రిని సత్కరించారు. శుభమస్తు షాపింగ్ మాల్ మేనేజింగ్ డైరెక్టర్ బయ్యా శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

రమేష్ సేవలు అభినందనీయం



రమేష్‌ను సత్కరిస్తున్న అధికారులు

నెల్లూరు(దర్గామిట్ట): డివిజనల్ పౌరసంబంధాల అధికారిగా రమేష్ అందించిన సేవలను జిల్లా సమాచార, పౌరసంబంధాల అధికారి సదారావు కొనియాడారు. డీపీఆర్వోగా పదోన్నతి పొంది ఒంగోలుకు బదిలీ అయిన రమేష్‌కు వీడ్కోలు కార్యక్రమాన్ని నగరంలోని సమాచార, పౌరసంబంధాల శాఖ కార్యాలయంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా సదారావు మాట్లాడారు. సమాచార శాఖలో 32 ఏళ్ల పాటు వివిధ హోదాల్లో పనిచేసిన రమేష్ విశిష్ట సేవలను అందించారని కొనియాడారు. పాత్రికేయులను సమన్వయం చేసుకుంటూ ప్రభుత్వపరంగా అక్రిడిటేషన్ల మంజూరు, ఇతర అంశాల్లో వారికి అన్ని విధాలా తోడ్పాటునందించారని తెలిపారు. అనంతరం ఆయన్ను ఘనంగా సత్కరించారు. ఏఈఐఈ కిషోర్, ఏపీఆర్వో రవీంద్రబాబు, సీనియర్ సహాయకులు ఖాదర్‌మస్తాన్, సువర్ణ, ఫరీద్ మస్తాన్, పీఆర్వో వినోద్‌కుమార్, పబ్లిసిటీ అసిస్టెంట్ శివరామ్‌ప్రసాద్, ఫొటోగ్రాఫర్ గురుప్రసాద్, వీడియోగ్రాఫర్లు సాయినాథ్, కాలేషా తదితరులు పాల్గొన్నారు.

రజక వృత్తిదారుల సమస్యలు పరిష్కరించాలి



క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న నేతలు

నెల్లూరు (వేదాయపాళెం): జిల్లాలో రజక వృత్తిదారులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని రజక వృత్తిదారుల రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మన్నూరు భాస్కరయ్య కోరారు. సంఘ జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని ఆంధ్రప్రదేశ్ వృత్తిదారుల సంఘ జిల్లా కమిటీ, రజక వృత్తిదారుల సంఘ ఆధ్వర్యంలో జేమ్స్‌గార్డెన్‌లోని సీఐటీయూ కార్యాలయంలో గురువారం నిర్వహించారు. నూతన సంవత్సర క్యాలెండర్లను ఆవిష్కరించిన అనంతరం భాస్కరయ్య మాట్లాడారు. వివిధ సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి రేకులకుంట అంకయ్య, కొంపర్లపాటి కామయ్య, రిటైర్డ్ ఎంఈఓ పాతపాటి రాధాకృష్ణ, పాదిలి మదన్, నేతలు వందేటి సురేంద్ర, బొప్పరాజు వెంకటేశ్వర్లు, బ్రహ్మదేవి వేదవతమ్మ, వెంకటేశ్వర్లు, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆమంచర్లలో ఉచిత వైద్య శిబిరం



నెల్లూరు రూరల్: ఆమంచర్ల పంచాయతీ పరిధిలో గల సేవాజ్యోతి కాలనీలో కుష్టు వ్యాధిగ్రస్తులకు ఉచిత వైద్య శిబిరాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువుర్ని పరీక్షించారు. అనంతరం వారికి అవసరమైన మందులు, కిట్లను అందజేశారు. డాక్టర్ సురేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు వస్త్రాల అందజేత

నెల్లూరు(బృందావనం): సుబేదారుపేటలోని మేరీనాయుడివీధిలో పేదలకు వస్త్రాలు, మిఠాయిలను గురువారం అందజేశారు. కేతా అంకుల్ వర్ధంతిని పురస్కరించుకొని కార్యక్రమాన్ని చేపట్టామని నిర్వాహకుడు సుబ్బారావు తెలిపారు.

ఆదాలకు మద్దతుగా ప్రచారం

నెల్లూరు(బారకాసు): రానున్న ఎన్నికల్లో నెల్లూరు రూరల్ నియోజకవర్గం నుంచి పోటీ చేయనున్న ఆదాల ప్రభాకర్‌రెడ్డిని గెలిపించాలని కోరుతూ 21వ డివిజన్లో గడప గడపకూ ప్రచారాన్ని జేసీఎస్ మండల ఇన్‌చార్జి మొయిళ్ల సురేష్‌రెడ్డి గురువారం నిర్వహించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు పెంచలనర్సారెడ్డి, రాజారెడ్డి, మధు, వెంగళ్‌రెడ్డి, వెంకటరత్నం, అశోక్, విజయ్, అప్పలనాయుడు, సుబ్బారావు, సాయి, మాల్యాద్రి తదితరులు పాల్గొన్నారు.

మండల సర్వసభ్య సమావేశం



మాట్లాడుతున్న నాగేంద్రబాబు

ఇందుకూరుపేట: స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో మండల సర్వసభ్య సమావేశాన్ని ఎంపీపీ గంధళ్ల శంకరయ్య అధ్యక్షతన, ఎంపీడీఓ నాగేంద్రబాబు ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడారు. మండలంలో 8986 మందికి పింఛన్ల రూపంలో దాదాపు రూ.2.69 కోట్ల మొత్తాన్ని ప్రభుత్వం ప్రతి నెలా అందజేస్తోందని తెలిపారు. వైఎస్సార్ చేయూత ద్వారా 4495 మందికి రూ.8.42 కోట్లను ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. అనంతరం ఆయా శాఖల ఆధ్వర్యంలో ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, లబ్ధిదారులు, వారికి కలిగిన ఉపయోగాలను వివరించారు. ఇందుకూరుపేట కోఆపరేటివ్ రూరల్ బ్యాంక్ చైర్మన్ మావులూరు శ్రీనివాసులురెడ్డి, డీటీ బషీర్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులపై సమీక్ష



మాట్లాడుతున్న శ్రీహరి

కోవూరు: మండలంలో పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన నిర్మాణ పనులను వేగవంతం చేయాలని ఎంపీడీఓ శ్రీహరి పేర్కొన్నారు. పంచాయతీరాజ్ శాఖ చేపడుతున్న పలు అభివృద్ధి పనులపై ప్రత్యేక సమీక్ష సమావేశాన్ని స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు తదితరాల నిర్మాణాలను వేగవంతం చేయాలని సూచించారు. పంచాయతీరాజ్ ఏఈ పరమేశ్వరలింగం తదితరులు పాల్గొన్నారు.

శ్రీనివాసులురెడ్డికి సత్కారం



ఇందుకూరుపేట: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్, ఇందుకూరుపేట కో ఆపరేటివ్ రూరల్ బ్యాంక్ చైర్మన్ మావులూరు శ్రీనివాసులురెడ్డిని పార్టీ జిల్లా యువజన విభాగ ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులుయాదవ్ మర్యాదపూర్వకంగా గురువారం కలిశారు. ఈ సందర్భంగా శ్రీనివాసులురెడ్డిని సత్కరించి కృతజ్ఞతలను తెలియజేశారు. కార్యదర్శిగా అవకాశం కల్పించిన ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి, యువజన విభాగ కోవూరు నియోజవర్గ అధ్యక్షుడు నల్లపరెడ్డి రజత్‌కుమార్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. నేతలు గూడూరు ప్రభాకర్‌రెడ్డి, స్వర్ణా శ్రీనివాసులురెడ్డి, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ పోస్టులకు ఇంటర్వ్యూలు



నెల్లూరు రూరల్: అంగన్‌వాడీ పోస్టులకు సంబంధించిన ఇంటర్వ్యూలను నగరంలోని ఆర్డీఓ కార్యాలయంలో గురువారం నిర్వహించారు. డివిజన్ పరిధిలోని నెల్లూరు, కోవూరు, ఇందుకూరుపేట, రాపూరు, వెంకటాచలం ప్రాజెక్టుల పరిధిలో అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్ పోస్టులకు ఇంటర్వ్యూలను జరిపారు. నాలుగు కార్యకర్తల పోస్టులకు 23 దరఖాస్తులు అందగా, ఇంటర్వ్యూలకు అందరూ హాజరయ్యారు. 23 హెల్పర్ పోస్టులకు 73 దరఖాస్తులు రాగా, ఇంటర్వ్యూలకు 49 మంది వచ్చారు. అభ్యర్థుల ఒరిజినల్ సర్టిఫికెట్లను పరిశీలించారు. ఆర్డీఓ మలోల, ఐసీడీఎస్ పీడీ హేనాసుజన్ తదితరులు పాల్గొన్నారు.

రంగస్థల కళాకారుడు రమణయ్యకు నివాళి



రమణయ్య చిత్రపటానికి నివాళి



కళాకారుల నాటక ప్రదర్శన

నెల్లూరు(బృందావనం): నగరంలోని పురమందిరంలో రంగస్థల కళాకారుడు భరద్వాజ రమణయ్య వర్ధంతిని అరుణకుమారి ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. తొలుత రమణయ్య చిత్రపటానికి నివాళులర్పించారు. రామాంజనేయ యుద్ధం, గయోపాఖ్యానం, బాలనాగమ్మ, సత్యహరిశ్చంద్ర, చింతామణి నాటకాలను కళాకారులు భద్రాచలం బాబు, ఎంబేటి జయరాజ్ ఆధ్వర్యంలో వివిధ ప్రాంతాలకు చెందిన కళాకారులు ప్రదర్శించారు. డప్పు కళాకారుడు వడ్డె చక్రపాణి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బ్రహ్మబాబా స్మృతి దినోత్సవం



బ్రహ్మబాబా చిత్రపటాలను అందజేస్తున్న ప్రసన్న

నెల్లూరు(బృందావనం): వేదాయపాళెంలోని బ్రహ్మకుమారి ఈశ్వరీయ విద్యాలయ జిల్లా కార్యాలయంలో బ్రహ్మబాబా స్మృతి దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన సంస్థ నెల్లూరు ఇన్‌చార్జి సిస్టర్ ప్రసన్న మాట్లాడారు. విద్యార్థి దశ నుంచి దయ గుణాన్ని అలవాటు చేసుకోవాలని కోరారు. నైతిక విలువలను ప్రతి ఒక్కరూ పెంపొందించుకోవాలని సూచించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు, బ్రహ్మబాబా చిత్రపటాలను అందజేశారు. రచయితల సంఘ జిల్లా అధ్యక్షుడు జయప్రకాష్, నిర్మల, సుమ, వెంకటేశ్వర్లు, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

షార్ట్ ఫిల్మ్ అసోసియేషన్ కార్యవర్గ ప్రమాణ స్వీకారం



నెల్లూరు(బృందావనం): నెల్లూరు షార్ట్ ఫిల్మ్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారాన్ని పురమందిర ప్రాంగణంలోని ఏసీ హాల్లో గురువారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన 25 కళాసంఘాల అధ్యక్షుడు అమరావతి కృష్ణారెడ్డి మాట్లాడారు. అసోసియేషన్ సంఘటితంగా ముందుకుసాగి ఆదర్శవంతంగా నిలవాలని కాంక్షించారు. అసోసియేషన్ అధ్యక్షుడిగా సాయి గోనెల, కార్యదర్శిగా శ్రీహరి, కోశాధికారిగా భావన, సహాయ కార్యదర్శులుగా నోవా, బాలసాయి, కార్యనిర్వాహక కార్యదర్శిగా శర్వాణి, సభ్యులుగా అజయ్, సాయిఅశోక్, శివ, రూప, స్వాతి ప్రమాణస్వీకారం చేశారు. తొలుత అసోసియేషన్ బ్రోచర్లను ఆవిష్కరించారు. కళా సంఘాల కన్వీనర్లు హరిబాబు, అమీర్‌జాన్ తదితరులు పాల్గొన్నారు

అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు తరలిరండి



మాట్లాడుతున్న శర్మద

నెల్లూరు(బారకాసు): విజయవాడలో అంబేడ్కర్ విగ్రహాన్ని శుక్రవారం ఆవిష్కరించనున్న నేపథ్యంలో నగరపాలక సంస్థ పరిధిలోని ప్రజలను భాగస్వామ్యం చేస్తూ అన్ని ఏర్పాట్లను పూర్తి చేశామని అదనపు కమిషనర్ శర్మద పేర్కొన్నారు. ఈ మేరకు కార్పొరేషన్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో గురువారం ఆమె మాట్లాడారు. నగరంలోని 28 ప్రాంతాల నుంచి ఉదయం ఐదు గంటలకు బయల్దేరనున్న వాహనాలకు ఇన్‌చార్జిలుగా వ్యవహరించాలని వివిధ సచివాలయాల కార్యదర్శులను ఆదేశించారు. కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

రోడ్డు భద్రత నియమాలపై అవగాహన అవసరం



ప్రశంసపత్రాన్ని అందజేస్తున్న అబ్దుల్ సుభాన్

నెల్లూరు(క్రైమ్): రోడ్డు భద్రత నియమాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని నగర ట్రాఫిక్ డీఎస్పీ అబ్దుల్ సుభాన్ సూచించారు. జాతీయ రహదారి భద్రత వారోత్సవాలను జనవరి 11 నుంచి 18 వరకు నెహ్రూ యువ కేంద్రం, నెల్లూరు ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఇందులో భాగంగా నగరంలోని ప్రధాన కూడళ్లలో ట్రాఫిక్ నియంత్రణకు చేపట్టాల్సిన చర్యలు, రోడ్డు భద్రత చర్యలపై 25 మంది వలంటీర్లకు శిక్షణ ఇచ్చారు. ఈ క్రమంలో వారోత్సవాల ముగింపు సందర్భంగా వలంటీర్లకు ప్రశంసపత్రాలను నగరంలోని ట్రాఫిక్ డీఎస్పీ కార్యాలయంలో డీఎస్పీ చేతుల మీదుగా గురువారం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా యువజన విభాగ అధికారి మహేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తూ బావిలో పడిన గోవు



నెల్లూరు(క్రైమ్): ప్రమాదవశాత్తూ బావిలో గోవు పడటంతో అగ్నిమాపకశాఖ అధికారులు రక్షణ చర్యలు చేపట్టారు. వివరాలు.. ఫతేఖాన్‌పేటలోని ఆంజనేయస్వామి గుడి సమీపంలో పాడుబడిన బావి ఉంది. ఆ బావిలో ప్రమాదవశాత్తూ గోవు గురువారం పడింది. గమనించిన స్థానికులు అగ్నిమాపక శాఖ అధికారులకు సమాచారం అందించారు. అగ్నిమాపక శాఖ నెల్లూరు కేంద్ర అధికారి వేణుగోపాల్ తన సిబ్బందితో కలిసి ఘటన స్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. లోతు అధికంగా ఉండటంతో రెండు ఫైరింజన్లతో బావిలోకి నీటిని పంపినా ఫలితం లేకుండాపోయింది. అర్ధరాత్రి వరకు రక్షణ చర్యలను అధికారులు కొనసాగించారు.